జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేం

వైఎస్సార్ సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆసిఫ్


జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆసిఫ్, భాగ్యలక్ష్మి, ఎస్సీ సెల్ నాయకులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): బడుగు, బలహీనవర్గాల ప్రజల అభ్యున్నతికి ఎనలేని కృషి చేసిన బాబూ జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేమని, ఆయన స్ఫూర్తితో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ కొనియాడారు. స్వాతంత్ర్య సమరయోధుడు, భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా విద్యాధరపురంలోని పార్టీ పశ్చిమ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆసిఫ్ మాట్లాడుతూ భారత రాజకీయ రంగాన్ని సుదీర్ఘ కాలం ప్రభావితం చేసిన మహనీయుడు జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా గుర్తింపు పొందిన ఆయన కార్మిక, రైల్వే, వ్యవసాయ శాఖల మంత్రిగా పని చేసి తనదైన ముద్ర వేశారని ప్రశంసించారు. దేశానికి హరిత విప్లవం, ఆహార భద్రత తీసుకువచ్చారని గుర్తు చేశారు. అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్, జ్యోతిరావు పూలే వంటి మహనీయులు జన్మించిన ఏప్రిల్ పుణ్య మాసమని పేర్కొన్నారు. నివాళులు అర్పించినవారిలో వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు టి.జమలపూర్ణమ్మ, మనోజ్ కొఠారి, షేక్ గౌస్‌మొహిద్దీన్, కార్పొరేటర్లు బలసాని మణిమ్మ, శిరంశెట్టి పూర్ణ, యలకల చలపతిరావు, మరుపిళ్ల రాజేష్, ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు పోలిమెట్ల శరత్, జనరల్ సెక్రటరీ తాండ్ర ఇంద్రకుమార్, కార్యదర్శులు చేపూరి శ్రీను, రుద్రశంకర్, థామస్, రాష్ట్ర నాయకులు దాసి జయప్రకాష్ కెనడి, కామళ్ల జోజి, రెడపంగు క్రాంతి, నాగెళ్ల సంగీతరావు, టీఎన్‌టీయూసీ నాయకుడు గోమతోటి వినోద్ పాల్ తదితరులు ఉన్నారు.

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట బంగారయ్య కొట్టు సెంటర్‌లోని సెయింట్ థామస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో శుక్రవారం జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ ఫైన్ ఆర్ట్స్, సెయింట్ థామస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాబు జగ్జీవన్‌రామ్ జీవితంలోని ముఖ్య విశేషాలను ప్రధానోపాధ్యాయుడు రాజుడేవిడ్ విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు పి.రమేష్, దుర్గాప్రసాద్, స్కూల్ ఇన్‌చార్జి చొప్పర రజనీకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ (జనరల్) మహేష్, మరో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కేవీ సత్యవతి జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వీఎంసీ మేనేజర్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

హౌసింగ్‌బోర్డ్‌కాలనీలోని ఎస్సీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను నిర్వహించారు. తొలుత జగజ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడుట్టి రామారావు, సెక్రటరీ దాసరి బుజ్జి, ట్రెజరర్ కోన సురేష్, ఉపాధ్యక్షులు ఎం విజయరాజు, జాయింట్ సెక్రటరీ పెయ్యల క్రీస్తుదాసు, సలహాదారులు భాస్కరరావు, సీఎస్ రవికుమార్, శశాంక్ బాబు తదితరులు పాల్గొన్నారు.

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): బాబు జగ్జీవన్‌రాం దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని కాకరపర్తి భావనారాయణ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు అన్నారు. ఆ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో జగ్జీవన్‌రాం జయంతి కార్యక్రమాన్ని కళాశాల ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నారాయణరావు జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో అట్టడుగు వర్గాల అభ్యున్నతికి జగ్జీవన్‌రాం విశేషమైన కృషి చేశారన్నారు. బిహార్‌లో అట్టడుగు వర్గాల నుంచి వచ్చిన ఆయన దేశంలోని ఉప ప్రధాని పదవిని సైతం నిర్వహించారని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.భాగ్యకుమార్, ఎన్ఎస్ఎస్ పీవోలు డి.పవన్‌కుమార్, ఎన్.సాంబశివరావు, కల్మబేగం, ఎన్‌సీసీ ఆఫీసర్ టీ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


కార్పొరేషన్ కార్యాలయంలో..


జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ నారాయణరావు తదితరులు


హెచ్‌బీకాలనీలో ఎస్సీ సంక్షేమ సంఘం ఆధ్వర్యాన..

క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రంలో ఎర్లీ చైల్డ్ హుడ్ ఎడ్యుకేషన్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రతి నెలా 5వ తేదీన నిర్వహించే ఈసీసీఈ కార్యక్రమంలో భాగంగా, బాబూ జగజ్జీవన్‌రామ్ జయంతినికూడా పురస్కరించుకుని శుక్రవారం స్థానిక కేఎల్ రావు నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో ఎర్లీ చైల్డ్ హుడ్ ఎడ్యుకేషన్ కార్యక్రమం జరిగింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు చేసే ఆటపాటలను వారి తల్లుల ముందు ప్రదర్శింపజేశారు. బాల్య దశ సంరక్షణ, ప్రాథమిక విద్య వంటి అంశాలపై నిర్వహించే వివిధ రకాల ఆటలు, కథలపై ప్రీ స్కూల్ పిల్లల తల్లులకు వివరించారు. బాబు జగ్జీవన్‌రామ్ గొప్పదనం తెలియజేస్తూ అంటరాని వారికి సమానత్వం కోసం అంకితమైన మహనీయుడని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సుధారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు వై. సౌజన్య, ఎస్. ఆల్ఫ్రన్స్, బి.విజయకుమారి, జి.పద్మావతి, ఆర్.హెలెన్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే కార్మికుల సంక్షేమమే లక్ష్యం



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైల్వే కార్మికుల సంక్షేమమే ముఖ్య అజెండా అని దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ జోనల్ సహాయ ప్రధాన కార్యదర్శి సత్యవాణి పేర్కొన్నారు. శుక్రవారం విజయవాడ రైల్వే ఆడిటోరియంలో డివిజన్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు బ్రాంచ్ చైర్మన్లు, కార్యదర్శులు పలు సమస్యలను సత్యవాణి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సత్యవాణి మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ్ విజయవాడ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు ఆమంచి వెంకటేశ్వరరావు, ఆకుల రాఘవేంద్ర, సుకుమార్, రమేష్, డేగల శ్రీను, కొయ్య రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ న్యాయమూర్తి ఫ్లారెన్స్‌కు నివాళి

భవానీపురం(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ కేఎల్‌రావునగర్‌కు చెందిన మాజీ న్యాయమూర్తి కటికల ఫ్లారెన్స్ బెంజిమెన్ అనారోగ్య కారణాలతో హాస్పటల్‌లో చికిత్స పొందుతూ గురువారం రాత్రి కన్నుమూశారు. సమాచారం తెలిసి గతంలో ఆమెతో కలిసి పని చేసిన పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు, స్థానిక రాజకీయ నాయకులు, సంఘ సేవకులు శుక్రవారం ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కైకలూరు, అవనిగడ్డ, మచిలీపట్నం ప్రాంత కోర్టుల్లో సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్‌గా సుదీర్ఘ కాలం సేవలు అందించారు.

అత్త మందలించడంతో కోడలు, మనుమరాలు అదృశ్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఫోన్ మాట్లాడవద్దని అత్త మందలించినందుకు కోడలు, మనుమరాలు ఇంట్లోంచి వెళ్లిపోయిన ఘటన గుణదల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఊర్మిళానగర్‌కు చెందిన మద్దెల లక్ష్మి పెద్ద కుమారుడు పూర్ణచంద్రరావు కుమార్తె తరచూ అపరిచితులతో ఫోన్‌లో మాట్లాడుతుంది. దీనిపై గతంలో దిశ పోలీస్‌స్టేషన్‌లో కేసు కూడా నమోదు చేశారు. ఇప్పుడు కూడా ఆమె ఫోన్‌లో మాట్లాడుతుండటంతో మద్దెల లక్ష్మి.. కోడలిని మందలించారు. దీంతో కోడలు, మనుమరాలు మద్దెల లక్ష్మితో వాగ్వివాదానికి దిగారు. గురువారం తెల్లవారుజామున నిద్రలేచి చూసేసరికి కోడలు, మనుమరాలు కనిపించలేదు. చుట్టుపక్కల వెదికినా ఫలితం లేకపోవడంతో గుణదల పీఎస్‌లో ఫిర్యాదు చేశారు.

ముందస్తు ఉగాది వేడుకలు

ధర్మవరప్పాడుతండ(జగ్గయ్యపేట): గ్రామంలోని రామ్‌కో సిమెంట్స్ కర్మాగారంలో శుక్రవారం ముందస్తు ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని ధర్మవరప్పాడుతండ, రావిరాల, జయంతిపురం, కెఅగ్రహారం, బూదవాడ గ్రామాలకు చెందిన పెద్దలను ఘనంగా సత్కరించారు. వారికి నూతన వస్త్రాలు, స్వీట్లు బహూకరించారు. అనంతరం కంపెనీ ప్రెసిడెంట్ ఆషిష్ కుమార్ శ్రీవాత్సవ్ మాట్లాడుతూ ఉగాది అందరి జీవితాల్లో కొత్తవెలుగులు నింపాలని ఆకాంక్షించారు.

ఆకట్టుకున్న హరికథా గానం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన హరికథా గానం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై విజయవాడకు చెందిన గుడిపాటి కల్చరల్ అసోసియేషన్‌కు చెందిన గుడిపాటి జయరామ సుధాకర్ యాగ రక్షణపై హరికథా గానం చేశారు. జయరామ సుధాకర్‌కు వయోలిన్‌పై డాక్టర్ పాణ్యం దక్షణామూర్తి, మృదంగంపై కె.జగన్మోహని సహకారం అందించారు. అమ్మవారి పంచ హారతుల అనంతరం నిర్వహించిన హరికథా గానాన్ని భక్తులు ఆసక్తిగా వీక్షించారు. అనంతరం హరికథా గానం చేసిన వారికి అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందజేశారు.

భారత మహిళా మండలికి నూతన కార్యవర్గం



విజయవాడ కల్చరల్: భారత మహిళా మండలి విజయవాడ శాఖకు 2024–2025 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు కార్యదర్శి వడ్డాది సూర్యకామేశ్వరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధ్యక్షురాలిగా రుత్తా శ్రీలక్ష్మి, ఉపాధ్యక్షురాలిగా తాడువాయి శశిరేఖ, జాయింట్ కార్యదర్శిగా ఆర్ ఉషామాధవి, ఇమిడియట్ పాస్ట్ ప్రెసిడెంట్‌గా వి.ఉమాదేవి, కమిటీ సభ్యులుగా జీవీఎల్‌కుమారి, టి.వసంతకుమారి, టి.దివ్యవాణి. ఎడ్వైజరి కమిటీ సభ్యులుగా ఎ.రత్నాలక్ష్మి, టి.సాయి లక్ష్మిని ఎన్నుకున్నట్లు వివరించారు.

పలువురికి ఆర్థిక సాయం

గన్నవరం రూరల్: సూరంపల్లిలో శుక్రవారం తోట సీతారామయ్య, సీతారామమ్మ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో చైర్మన్ తోట వెంకయ్య పలువురు పేదలకు ఆర్థిక సాయం అందించారు. ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

‘పశ్చిమ’ గెలిచి జగనన్నకు కానుకగా ఇస్తా

వైఎస్సార్ సీపీ ‘పశ్చిమ’ అభ్యర్థి షేక్ ఆసిఫ్


ఎన్నికల ప్రచారంలో రిక్షావాలాకు కరపత్రం అందజేస్తున్న ఆసిఫ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దేవుడి దయ.. ప్రజల అండతో పశ్చిమ నియోజకవర్గంలో గెలిచి ఈ సీటును సీఎం జగనన్నకు కానుకగా ఇస్తానని వైఎస్సార్ సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ అన్నారు. 43వ డివిజన్ ఊర్మిళానగర్‌లో శుక్రవారం కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డితో కలిసి ఆసిఫ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పార్టీ రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేశారు. చేతి వృత్తిదారులను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రచారంలో భాగంగా బట్టలు ఇస్త్రీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు రాజకీయ స్వార్థం కోసం వృద్ధులు, వికలాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, కొండ ప్రాంత ప్రజలను ఇబ్బందులకు గురి చేశారన్నారు. వలంటీర్ల ద్వారా జరుగుతున్న పెన్షన్ పంపిణీని అడ్డుకుని వృద్ధులను కష్టాల పాల్జేశారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి సామాజిక పెన్షన్లు ఇంటి వద్దనే పంపిణీ చేస్తున్నారన్నారు.

పగటి వేషగాళ్లకు స్థానం లేదు

పశ్చిమ నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఎన్నికల సమయంలో డబ్బు మూటలతో వచ్చే పగటి వేషగాళ్లు, పెత్తందారులను ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించబోరని స్పష్టం చేశారు. 58 నెలల్లో ‘పశ్చిమ’లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేశామని వివరించారు. ప్రజలకు అందుబాటులో ఉంటున్న తనను గెలిపించాలని అభ్యర్థించారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు బాపతికోటిరెడ్డి, ఎండీ ఇర్ఫాన్, నేతలు బెవర నాగేశ్వరరావు, కరీంఖాన్, ఎస్వీ రెడ్డి, తిరుపతిరావు, రామిరెడ్డి పాల్గొన్నారు.

ముస్లింల అభ్యున్నతికి కృషి


మసీదు పెద్దలతో ఆసిఫ్, గౌస్‌మొహిద్దీన్, రాయన నరేంద్ర తదితరులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ముస్లింల అభ్యున్నతికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ పశ్చిమ అభ్యర్థి షేక్ ఆసిఫ్ చెప్పారు. 46వ డివిజన్ పరిధిలోని అలీనగర్ మస్జిద్-ఎ-అలీ మసీదులో శుక్రవారం ముస్లిం పెద్దలను కలిసి మద్దతు కోరారు. ఆసిఫ్‌తో పాటు నగర నాయకులు రాయన నరేంద్ర, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ గౌస్‌మొహిద్దీన్ వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. తొలుత స్థానిక పెద్దలు, యువకులతో కలిసి ఆసిఫ్, మొహిద్దీన్ ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఆసిఫ్ మాట్లాడుతూ మైనార్టీ వర్గాన్ని తన గుండెల్లో పెట్టుకుని రాజ్యాధికారంలో భాగస్వాములను చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించడానికి టీడీపీ కూటమి ప్రయత్నిస్తోందని, వాటిని ముస్లింలు తిప్పి కొట్టాలని కోరారు. కార్యక్రమంలో మజ్జిద్ ఇమామ్ అబ్దుల్ కరీం, కమిటీ అధ్యక్షులు ఎండీ పాచ్చా సాహెబ్, ముతవల్లి ఎండీ రషీద్, ఉపాధ్యక్షులు హుస్సేన్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

ఉగాదికి ‘వేగ’ ప్రత్యేక ఆఫర్లు



పోస్టర్ ఆవిష్కరించిన నటి డింపుల్ హయతి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని వేగ జ్యూయలర్స్‌లో ప్రత్యేక ఆఫర్లు అందిస్తున్నట్లు సంస్థ యజమానులు వనమా నవీన్, సుధాకర్ తెలిపారు. లబ్బీపేట నందమూరిరోడ్డులోని వేగ జ్యూయలర్స్ ఆభరణాల షోరూంలో ఉగాది పండుగా సందర్భంగా ఖాతాదారులకు అందిస్తున్న ప్రత్యేక ఆఫర్ల పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ముఖ్య అతిథి, సినీ నటి డింపుల్ హయతి పోస్టర్ ఆవిష్కరించారు. షోరూం లోని ప్రత్యేక ఆభరణాలపై ఆమె అడిగి తెలుసుకున్నారు. అధునాతన ఆభరణాలతో పాటు సంస్కృతి సంప్రదాయాలను చాటి చెప్పే విభిన్న ఆభరణాలను ఖాతాదారులకు అందిస్తున్న సంస్థ అధినేతలు నవీన్, సుధాకర్‌లను అభినందించారు.

ఈ సందర్భంగా సంస్థ అధినేతలు నవీన్, సుధాకర్ మాట్లాడుతూ ఉగాది సందర్భంగా వేగ జ్యూయలర్స్‌లో ప్రత్యేక ఆఫర్లు ఇస్తున్నట్లు చెప్పారు. ఈ ఆఫర్లు ఏప్రిల్ 30 వరకు ఉంటాయన్నారు. ఈ నెలలో అనేక వివాహ ముహూర్తాలు ఉన్నందున మా షోరూంలో అందిస్తున్న ప్రత్యేక ఆఫర్లను అందిపుచ్చుకుని, వేగ ఆభరణాలతో వివాహ వేడుకను మరింత వైభవోపేతంగా జరుపుకోవాలన్నారు. ఉగాది పర్వదినం, శుభముహూర్తాలను దృష్టిలో ఉంచుకుని సంప్రదాయ సిద్ధమైన ఆభరణాలను షోరూం లో విస్తృత శ్రేణిలో ఏర్పాటు చేశామన్నారు. బంగారం కొనుగోలుపైన ప్రతి గ్రాముకు రూ.250, అలాగే పాత బంగారం మార్పిడి పైన అదనంగా రూ.150 తగ్గింపు, డైమండ్ జ్యూయలరీ క్యారట్ ధర రూ. 54వేలు అందిస్తామని, పోల్కీ జ్యూయలరీ పైన ఎలాంటి తయారీ, తరుగు చార్జీలు ఉండవని యాజమాన్యం ప్రకటించింది. ఖాతాదారులకు నూతన తెలుగు సంవత్సరాది ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

సందేశాన్నిచ్చే మాసం రంజాన్

పెత్తందారుడిని తరిమికొట్టాలి: ఎంపీ నాని


ఇఫ్తార్‌ను ప్రారంభిస్తున్న కేశినేని నాని

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సందేశాన్నిచ్చే మాసం రంజాన్ అని విజయవాడ ఎంపీ కేశినేని తెలిపారు. ఎం.ఎస్.పంచ్ తన్ రాహే హఖ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముసాఫిర్‌ఖానా ప్రాంగణంలో శుక్రవారం రాత్రి దావతే ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేశినేని నాని ఇఫ్తార్ విందుకు హాజరైన ముస్లింలను ఆప్యాయంగా పలకరిస్తూ, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఉపవాసాలు ముగించుకున్న ముస్లింలకు ఇఫ్తార్ విందును అందించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని నాని మాట్లాడుతూ శాంతి నెలకొల్పాలని, ఐకమత్యం పరిఢవిల్లాలని ఉపవాసాలు ఉండే మాసం రంజాన్ అన్నారు. రానున్న ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గంలో పెత్తందారుడికి, సామాన్యునికి పోటీ జరుగుతుందన్నారు. పెత్తందారుడు సుజనాను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. మనలో ఒకడు, మన అందరివాడు షేక్ ఆసిఫ్ అన్నారు. మైనారిటీలు, బీసీలను మోసం చేసి, ఢిల్లీ నుంచి ఒక నాయకుడిని దిగుమతి చేసి ఇక్కడ కూటమి అభ్యర్థిగా నిలిపారన్నారు. అతని మీద భారీ మెజారిటీతో గెలిచి ఆసిఫ్ పశ్చిమలో చరిత్ర సృష్టించబోతున్నారని చెప్పారు. ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ మాట్లాడుతూ అందరికీ మంచి జరగాలని, కలిసి మెలసి ఉండాలని కోరుతూ రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు చేస్తారన్నారు. ఐకమత్యంతో, మతసామరస్యంతో ఉన్న పశ్చిమంలో వివాదాలు సృష్టించే శక్తులను తరిమికొట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ గౌస్‌మొహిద్దీన్, కార్పొరేటర్లు అబ్దుల్ అర్షద్ అకీబ్, ఎండీ ఇర్ఫాన్, యలకల చలపతిరావు, శిరంశెట్టి పూర్ణచంద్రరావు, రాష్ట్ర వక్ఫ్ బోర్డు డైరెక్టర్ షేక్ ఖాజా, మైనార్టీ సెల్ యువజన నేత షేక్ హయాత్, 54వ డివిజన్ ప్రెసిడెంట్ అబ్దుల్ వాహబ్, మైనారిటీ సెల్ జిల్లా ప్రెసిడెంట్ మొహమ్మద్ రఫీ, మున్నీర్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ మున్నీర్, సీనియర్ మైనారిటీ నాయకులు జీఎంసీ బాష, బషీరుల్లా అమనుల్లా, సుభాని, ఇక్బాల్, ఎస్సీ సెల్ నగర అధ్యక్షులు బుదాల శ్రీనివాసరావు, ట్రేడ్ యూనియన్ జిల్లా ప్రెసిడెంట్ నంబూరి ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి నూకాలమ్మ జాతర

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్ సొరంగం సమీపంలోని శ్రీ నూకాలమ్మ జాతర మహోత్సవాలు ఈ నెల 8వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయని ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు. 8వ తేదీ ఉదయం 9 గంటలకు కలశస్థాపన, 9 తేదీ అమ్మవారికి సన్నిధిలో విశేష కుంకుమార్చన జరుగుతాయని తెలిపారు. 10వ నుంచి 19వ తేదీ వరకు రోజుకో విశేష పూజ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 20వ తేదీ కృష్ణా నది నుంచి కలశాలతో నదీ జలాలతో ఊరేగింపు, అనంతరం ఆలయంలో అమ్మవారి మూలవిరాట్‌ను నదీ జలాలతో అభిషేకం, 21వ తేదీ ఆదివారం ఉదయం 7 గంటలకు అమ్మవారి సంబరం జరుగుతుందని వివరించారు.

● ఎండకు ముసుగు







భాస్కరుడి ప్రతాపానికి నగర ప్రజలు అల్లాడిపోతున్నారు. రోజు రోజుకూ ఎండ అధికమవుతుండటంతో ఇళ్ల నుంచి బయటకు వచ్చేటప్పుడు ప్రజలు రక్షణ చర్యలు తీసుకుంటున్నారు. కొందరు టోపీలు ధరిస్తుంటే.. కొందరు మహిళలు పమిట చెంగులనే ముసుగులుగా ఎండ నుంచి రక్షణ పొందుతున్నారు. మరికొందరు చిరువ్యాపారులు గొడుగులతో ఉపశమనం పొందుతున్న దృశ్యాలు శుక్రవారం నగరంలో కనిపించాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

పేకాటరాయుళ్ల అరెస్ట్

పెనమలూరు: పేకాడుతున్న ఐదుగురు వ్యక్తులను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ.రామారావు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు ఎన్టీఆర్ బస్‌స్టాపు సమీపంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు తనిఖీ చేయగా పేకాట ఆడుతూ ఐదుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. వారి వద్ద రూ. 13,300 సొమ్ము స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

ఇన్‌కం ట్యాక్స్ రిటర్నులు దాఖలు చేయాలి

కంచికచర్ల: ఇన్‌కంటాక్స్ పరిధిలోకి వచ్చే ప్రభుత్వ పెన్షనర్లు 2023–24 ఆర్థిక సంవత్సరానికి తప్పనిసరిగా ఇన్‌కంట్యాక్స్ రిటర్న్ దాఖలు చేయాలని విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు సానె రామ్మోహనరావు సూచించారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో శుక్రవారం రిటైర్డ్ ఎంప్లాయిస్‌తో సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో రిటర్నులు దఖలు చేయనివారు పెనాల్టీ చెల్లించాల్సి వచ్చిందన్నారు. ఆ పరిస్థితి రాకుండా ఇన్‌కంట్యాక్స్ రిటర్నులు దఖలు చేయాలని సూచించారు. విజయవాడ మాక్సివిజన్ ఐ సూపర్‌స్పెషాలిటీ వైద్యులు సంఘ కార్యాలయంలో విశ్రాంత ఉద్యోగులకు కంటి పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. నలుగురికి కాటరాక్ట్ ఆపరేషన్ చేయాలని నిర్ధారించినట్లు వివరించారు.

● **విజయవాడ కల్చరల్:** స్వామి పరమానంద(డాక్టర్ క్రోవి పార్థసారథి) రచించిన శ్రీ విద్యా పాదుకాంత పూర్ణదీక్ష గ్రంథావిష్కరణ సభను మారుతీ గ్యాస్ కంపెనీ సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీ మంగళవారం జరుగుతుందని నిర్వాహకుడు చెట్లపల్లి మారుతీ ప్రసన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్టీఎస్ రోడ్డులోని గాయత్రి కన్వెన్షన్ హాల్‌లో జరిగే కార్యక్రమంలో పలువురు పాల్గొంటారని పేర్కొన్నారు.